# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అశాంతి, హింసను వ్యాప్తి చేసే ప్రయత్నాలను భారత్ వ్యతిరేకిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2. నామినేటెడ్ పోస్టుల్లో వెనుకబడిన వర్గాలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**3. రహదారుల పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు.**

**4. యాసంగి సీజన్‌లో ఎరువుల సరఫరాకు ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

**5. జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

===========================

అశాంతి, హింసను వ్యాప్తి చేసే ప్రయత్నాలను భారత్ వ్యతిరేకిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత సాయంత్రం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ,ప్రభువైన క్రీస్తు బోధనలు ప్రేమ, సామరస్యం సోదరభావాన్ని తెలియజేస్తాయని అన్నారు. భారత్ విదేశాంగ విధానం జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్…30 సెకన్లు

--------------------------

మైనార్టీ వర్గాల సంక్షేమానికి, భద్రతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో నిన్న ఆయన పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

..వాయిస్…30 సెకన్లు

--------------------------

నామినేటెడ్ పోస్టుల్లో వెనుకబడిన వర్గాలు – బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ సూచనలపై చర్చించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ల సాధనకు న్యాయ పరమైన పోరాటం చేయాలని నిర్ణయించామని చెప్పారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనతో పాటు తక్షణ మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నైపుణ్య విద్య కోసం బీసీ వసతి గృహాల్లో నాలెడ్జ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

రహదారుల పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న రహదారుల పనులను ఆయన నిన్న తనిఖీ చేసి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గుడివాడ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల తాగునీటి పథకాల అమలు తీరును ఉపముఖ్యమంత్రి పరిశీలించారు. మల్లాయపాలెంలో రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా అయ్యే నీటిని శుద్ధి చేసే విధానాన్ని తనిఖీ చేసి... నీటి నాణ్యత పరీక్షలను పరిశీలించారు. 43 గ్రామాల్లో తాగునీటి పథకాల మరమ్మతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి ఎమ్. రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని 8 నూతన ఆర్టీసి బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభించనున్నామని చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీని బలోపేతం చేసి ఆ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ...30... సెకన్లు

---------------------------

యాసంగి సీజన్‌లో ఎరువుల సరఫరాకు ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన జీలుగ, జనుము, పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. పప్పుదినుసులు, నూనె గింజల పంటల సాగును పెంచేందుకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తేవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో భవన నిర్మాణాల కోసం ఐదు అంతస్తుల వరకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే సరిపోతుందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పురపాలక శాఖపై నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాల

మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, లేఅవుట్, భవనాలకు సంబంధించి మున్సిపాలిటీకి రుసుము చెల్లిస్తే అనుమతులన్నీ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వరదనీరు, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై 15 రోజుల్లో సమగ్రనివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ కేంద్రంలో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నియామక పత్రాలను అందజేశామని, పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 26 సెకన్లు

-------------------------

జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1986 డిసెంబర్ 24వ తేదీన వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో అప్పటినుంచి ప్రతి ఏటా ఈరోజున జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అయితే ప్రస్తుత కాలానికి అనుగుణంగా 1986 నాటి వినియోగదారుల పరిరక్షణ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం -2019ని తీసుకొచ్చింది. ఈ చట్టం వినియోగదారులకు మరింత రక్షణ కల్పిస్తుంది.కాగా జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారం అవుతుంది.

-------------------------

స్వయం సహాయక బృందాలు- ఎస్‌హెచ్‌జీలకు తొలి విడతలో 231 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఎస్‌హెచ్‌జీలకు ఉపాధి కల్పన, సౌర ప్లాంట్ల ఏర్పాటుపై ఆమె నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లో 231 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆలయ భూముల్లో మహిళా సంఘాలకు ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం 6 నెలల్లోగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు మాదాపూర్ ఇందిరా మహిళా శక్తి బజార్‌లో జనవరి 25లోపు 'సరస్ మేళా' ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

-------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈనెల 30వ తేదీన సమావేశం కానుంది హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ విధివిధానాలపై చర్చించే అవకాశముందని అధికారులు తెలిపారు. భూమిలేని పేదలకు నగదు బదిలీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

=====================